## మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

తూప్రాన్, ఫిబ్రవరి 3: తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు జారీచేశారు. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలోనే పౌరుడిపై సిబ్బంది దాడి చేశారన్న ఆరోపణలతో పోలీసు కేసు నమోదైంది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రవీణ్, మల్లికార్జున్‌గౌడ్‌ను తొలగిస్తూ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ అయినట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహియుద్దీన్ వెల్లడించారు.



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట జడ్పీహెచ్ఎస్

## ‘పీఎంశ్రీ’ పాఠశాలలకు రూ. 24 లక్షలు

● మంజూరు చేసిన విద్యాశాఖ ● సంగారెడ్డి జిల్లాలో 25 స్కూళ్ల ఎంపిక

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3: ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన ఊరు-మన బడి పథకం తరహాలో కేంద్ర ప్రభుత్వం ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో పథకాన్ని ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో 25 ప్రభుత్వ పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ గతేడాది ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఆయా పాఠశాలలకు నిధులు విడుదల చేయలేదు. దీనిపై గతేడాది డిసెంబరు 20న ‘పీఎంశ్రీ పాఠశాలల ఎంపిక సరే.. నిధులేవీ?’ శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. తాజాగా పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా 21 పాఠశాలలకు రూ.99,939 చొప్పున రూ.20,98,719, నాలుగు బడులకు రూ.75 వేల చొప్పున రూ.3 లక్షలు మంజూరయ్యాయి. ఐదేళ్ల పాటు ప్రతీ ఏటా దశలవారీగా కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన పాఠశాలలకు నిధులు మంజూరు చేయనున్నది.

## సమస్యలుంటే చెప్పండి.. నిధులిస్తా

బోరంచ ఎత్తిపోతలకు అదనపు నిధులు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

రేగోడు ఫిబ్రవరి 3: గ్రామాల్లో సమస్యలు వివరిస్తే పరిష్కారానికి ఎన్ని నిధులు అవసరమైనా మంజూరు చేయిస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. రేగోడు మండలంలో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని, అసంపూర్తిగా ఉన్న బోరంచ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయడానికి అదనపు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. రేగోడు, మర్పల్లి, చౌదరిపల్లి, కొత్వాన్‌పల్లి గ్రామాల చెరువులకు గొలుసుకట్టు కాల్వల ద్వారా మంజీరా నీటిని తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రేగోడు మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపడానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాల పునర్విభజనపై ప్రభుత్వం ఇప్పటికే కమిటీ వేసిందని వివరించారు.

### కిడ్నీ బాధితుడికి భరోసా

రెండు కిడ్నీలు పాడైపోయిన మర్పల్లి గ్రామానికి చెందిన బండి హరికృష్ణను ఆదుకుంటానని మంత్రి దామోదర్ భరోసా ఇచ్చారు. గ్రామానికి వచ్చిన మంత్రిని కలిసి హరికృష్ణ ఆదుకోవాలని విన్నవించగా ఆయన స్పందించారు. కిడ్నీ బదిలీ కోసం నిమ్స్ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతానని తెలిపారు.



జగిర్యాలలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

అనంతరం ఆయన రేగోడులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌లో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో వసతుల కోసం రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం రేగోడు దత్తాత్రేయ ఆలయంలో, ఆర్ ఇటిక్యాల గ్రామంలో నిర్వహిస్తున్న శాంతప్ప మహారాజ్ ఆరాధన ఉత్సవాల్లో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ బాలలక్ష్మి, ఎంపీపీ సరోజన, జడ్పీటీసీ యాదగిరి, మాజీ ఎంపీపీ దిగంబర్ రావు, కిషన్ తదితరులు ఉన్నారు.



అందోలులో 150 పడకల ఆస్పత్రి కోసం స్థల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## అందోలులో 150 పడకల ఆస్పత్రి

● నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనం కూడా ఇక్కడే

● స్థలాన్ని పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, ఫిబ్రవరి 3: అందోలు పట్టణ శివారులో 150 పడకల అధునాతన ఆస్పత్రిని నిర్మించనున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన 1,141 సర్వే నంబర్‌లో మహిళా పాలిటెక్నిక్ కళాశాల పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని శనివారం పరిశీలించారు. అధికారులు ప్రతిపాదించిన స్థలంలో 150 పడకల అధునాతనమైన ఆస్పత్రిని ఏర్పాటు నిర్మిస్తామని తెలియజేశారు. పక్కనే మహిళా నర్సింగ్ కళాశాల, హాస్టల్‌ను సైతం ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

### పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ

అనంతరం మంత్రి అందోలు పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లాస్‌రూంలోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, హాస్టల్ భవనాన్ని కూడా పరిశీలించారు. విద్యార్థినుల విన్నపంమేరకు కాలేజీకి ప్రహరీ, వర్క్‌షాప్ కోసం షెడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈయన వెంట ఆర్డీవో పాండునాయక్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక కౌన్సిలర్లు ఎస్. సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, హరికృష్ణాగౌడ్, నాయకులు ప్రదీప్‌గౌడ్, ప్రవీణ్, వినయ్ కుమార్‌గౌడ్ అధికారులు పాల్గొన్నారు.



అందోలు-జోగిపేట మున్సిపాలిటీ

## బల్దియాలో అవిశ్వాసం లేనట్టేనా?

● ఆసక్తికరంగా అందోలు-జోగిపేట మున్సిపల్ రాజకీయం ● బీఆర్ఎస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి మంత్రి నో?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, ఫిబ్రవరి 3: అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో రాజకీయం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినందుకు అందోలు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అంగీకరించలేదని తెలుస్తున్నది. మూడున్నరేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డులున్న మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నుంచి 13 మంది కౌన్సిలర్లు గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి ఆరుగురు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఎన్నికయ్యారు. అనంతరం ఇండిపెండెంట్ కౌన్సిలర్ బీఆర్ఎస్‌లో చేరారు. మెజార్టీ కౌన్సిలర్లు ఉండడంతో బీఆర్ఎస్‌కు చెందిన 11వ వార్డు కౌన్సిలర్ గూడెం మల్లయ్య చైర్మన్‌గా ఎంపికయ్యారు. చైర్మన్ ఎన్నిక సమయంలో నిర్వహించిన క్యాంపు రాజకీయాల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సొంత పార్టీ కౌన్సిలర్లు ఆయనపై తిరుగుబాటు చేశారు. పలుమార్లు బహిరంగంగానే విమర్శించారు. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి సిద్ధమయ్యారు. ఈక్రమంలో రాష్ట్రంలోని మరికొందరు మున్సిపల్ చైర్మన్లతో కలిసి ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కానీ, అవిశ్వాసం విషయంలో తాము జోక్యం చేసుకోమని హైకోర్టు ఇటీవలే తీర్పు ప్రకటించింది. దీంతో ఈ మున్సిపాలిటీలో అవిశ్వాస సెగలు మళ్లీ రగులుకున్నాయి.

### కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

చైర్మన్, వైస్ చైర్మన్ వ్యవహారం నచ్చని ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. దాంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం 9 కి చేరింది. చైర్మన్, వైస్ చైర్మన్ మినహా మిగిలిన తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్‌పై అసంతృప్తితో ఉన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తే మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న చైర్మన్ మల్లయ్య ఇటీవల మంత్రి దామోదర్ రాజనర్సింహతో సఖ్యతగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం ప్రవేశపెట్టే విషయమై కాంగ్రెస్ కౌన్సిలర్లు మంత్రితో చర్చించినట్టు తెలిసింది. అయితే ఇంకా 9 నెలల పదవీ కాలం మాత్రమే ఉండడంతో అవిశ్వాసానికి మంత్రి సుముఖత వ్యక్తం చేయలేరని తెలిసింది. ఇంత తక్కువ కాలం పదవిలో ఉండేదానికి ఇప్పుడు క్యాంపు రాజకీయాలు నిర్వహించడం, కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం ఖర్చు పెట్టడం దండగ అని ఆయన అభిప్రాయపడినట్టు సమాచారం. ఇందుకు బదులుగా వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బల్దియాలోని 20 స్థానాలు దక్కించుకుని చైర్మన్, వైస్ చైర్మన్ పొందేలా కృషి చేయాలని మంత్రి కౌన్సిలర్లతో అన్నట్లు తెలిసింది. దాంతో ఇక చైర్మన్‌గా జి.మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్(డేవిడ్)లు తమ పదవుల్లో పూర్తి స్థాయిలో కొనసాగనున్నారు. ఏమైనా మంత్రి ఇలా మాట్లాడడంతో కొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.



## మామిడి ముందే వచ్చింది..

మామిడి చెట్లకు పూత పూసే సమయంలోనే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మాత్రం కాయలు విక్రయానికి రావడంతో జనాలు ఆసక్తిగా కొనుగోలు చేశారు. మనూరు మండలం బోరంచలో సత్యయ్య అనే రైతు చెట్టుకు కాసిన మామిడి కాయలను చాంద్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన వ్యాపారి బాలయ్య శనివారం తన దుకాణంలో విక్రయానికి ఉంచారు.

-నారాయణఖేడ్

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● హైకోర్టు జస్టిస్ గిరిజా ప్రియదర్శిని

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3: చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని పేర్కొన్నారు. అంతర్జాతీయ కేన్సర్ దినం సందర్భంగా సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాల ఆడిటోరింలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగవారితో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

### వీడియో కాన్ఫరెన్స్ గది ప్రారంభం

సంగారెడ్డి జిల్లా కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ గదిని జస్టిస్ గిరిజా ప్రియదర్శిని ప్రారంభించారు. అనంతరం న్యాయాధికారులు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని పారా లీగల్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత న్యాయ సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు, జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి జె.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.




ఎంఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు జస్టిస్ గిరిజా ప్రియదర్శిని



## ఉల్లి రైతుకు ఏదీ మద్దతు?

● నెల క్రితం కిలో రూ. 30.. ప్రస్తుతం రూ. 12 మాత్రమే

● పెట్టుబడి తిరిగి రావడమూ కష్టమేనంటున్న రైతులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 3: ఉల్లి రైతుకు మద్దతు కరువైంది. మార్కెట్‌లో ధర సగానికి పైగా పతనమైంది. లాభాలు ఆర్జించవచ్చని ఉల్లి పంట సాగు చేయగా.. పెట్టుబడి కూడా తిరిగివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నెల రోజుల క్రితం మార్కెట్‌లో క్వింటాలు ఉల్లి ధర రూ.3 వేలు ఉండగా.. ప్రస్తుతం క్వింటాలుకు రూ.1,200 నుంచి రూ.1,400 వరకు మాత్రమే ధర పలుకుతున్నది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### ఎకరానికి రూ. 70వేలు ఖర్చు

నారాయణఖేడ్ డివిజన్‌లో ఉల్లిపంట ఎక్కువగా సాగు చేస్తారు. ఎకరా విస్తీర్ణంలో ఉల్లిని పంటను సాగు చేయడానికి రూ. 60వేల నుంచి రూ. 70 వేల వరకు ఖర్చవుతుంది. గతేడాది ఎకరాకు 100 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర క్వింటాలుకు అత్యధికంగా రూ. 6వేల వరకు పలికింది. ఈసారి వాతావరణ మార్పుల కారణంగా దిగుబడి 70 నుంచి 80 క్వింటాళ్లకు మించడం లేదు. మరోవైపు ధర కూడా భారీగా పతనమవుతున్నది. నెల క్రితం వరకు మార్కెట్‌లో ఉల్లిగడ్డ క్వింటాలుకు రూ. 3వేల వరకు పలికింది. కానీ క్రమంగా ధరలు పతనమవుతూ ప్రస్తుతం ధర క్వింటాలుకు రూ. 1,200 నుంచి రూ. 1,400 మాత్రమే ధర పలుకుతున్నది.

### నిల్వ చేసేందుకు వసతులు కరువు

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరకు ఉల్లి పంటను విక్రయిస్తే పెట్టుబడులకే సరిపోతుందని, తామెలా బతకాలని రైతులు వాపోతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు తగ్గిపోయాయని, ధర పెరిగే నిల్వ ఉంచడానికి సౌకర్యాలు లేవని రైతులు వాపోతున్నారు. స్థానికంగా ఉల్లిని నిల్వ ఉంచే పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు కూడా తక్కువ ధర చెల్లిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన పంటను వెంటనే పక్క రాష్ట్రాలకు తరలించి విక్రయిస్తున్నారు. లాభాలు ఆర్జించవచ్చని ఉల్లిగడ్డను సాగు చేస్తే ఖర్చులకే సరిపోతున్నదని రైతులు ఉసూరుమంటున్నారు.

### పెట్టుబడికే సరిపోతున్నది



ఎకరం పావు పొలంలో ఉల్లి పంటను సాగు చేశాను. పెట్టుబడి రూ.80 వేల వరకు ఖర్చు చేశాను. 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట చేతికి వచ్చిన తరుణంలో ధర పడిపోవడంతో పెట్టుబడికే సరిపోతున్నది.

- కిషన్, నారాయణఖేడ్



## ప్రభుత్వ పాఠశాలా? పార్కింగ్ స్థలమా?

అది చిన్నారులు చదువునే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. అదే ఆవరణలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. కానీ అజమాయిషీ లేకపోవడంతో చుట్టపక్కలవారు పాఠశాల ఆవరణను తమ వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నారు. చుట్టుపక్కల భవనాలు కడుతున్నవారు నిర్మాణ సామగ్రిని ఇదే గ్రౌండ్‌లో ఉంచుతున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో.. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న కాలనీలోని ఈ స్కూల్‌లో 67 మంది విద్యార్థులు చదువుకుంటుండడం గమనార్హం.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి



## మెదక్‌లో ట్రాఫిక్ తిప్పలు

మెదక్ జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్నది. వీధుల్లో ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ డిపో, పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా, జేఎన్‌రోడ్, చమన్ చౌరస్తా, అంబేడ్కర్ సర్కిల్, మార్కెట్ చౌరస్తా, గర్ల్స్ హైస్కూల్ రోడ్‌లో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా దుకాణాలకు పార్కింగ్ లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతోపాటు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆటోలను చౌరస్తాల్లోనే నిలుపుతున్నారు.

-మెదక్

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి

● తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్

చేర్యాల, ఫిబ్రవరి 3: మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ పేర్కొన్నారు. ప్రకృతి పర్యావరణసంస్థ ఆధ్వర్యంలో శనివారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మత్స్యకారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడం ద్వారా దళారీవ్యవస్థను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు, వ్యవసాయ, చేపల ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుతాయన్నారు. ప్రతీ మత్స్యకారుడు సంఘంలో వాటాదారుడిగా చేరాలని, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈవో మూగ జయశ్రీ పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస భిక్షపతి, చేర్యాల ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మత్స్యకార సంఘాల ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నారదాసు ఈశ్వర్, ప్రతినిధులు తిరుపతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

## టెన్త్ విద్యార్థులకు సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 3: సిద్దిపేట ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గ్రామీణ ప్రతిష్ఠ తెలంగాణ రాష్ట్ర సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు శనివారం జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు ముఖ్య అతిథులుగా హాజరైన ఇందిరానగర్ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి పరీక్ష బ్రోచర్‌ను, సెట్ పేపర్లు విడుదల చేశారు. ఇటీవల జిల్లాలోని 26 మండలాల్లో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో నిర్వహించిన పరీక్షలో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన జడ్పీ, కస్తూర్బా మోడల్‌స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో జిల్లాస్థాయి ఇంగ్లిష్ మీడియంలో మొదటి స్థానం కోహెడ జడ్పీఎస్ఎస్ విద్యార్థి అంజనాదేవి, ద్వితీయస్థానం నారాయణరావుపేట విద్యార్థి నిహారిక, తృతీయస్థానం కోహెడ జడ్పీఎస్ఎస్ విద్యార్థి శ్వేత, తెలుగు మీడియంలో చీకోడ్ జడ్పీఎస్ఎస్‌కు చెందిన అక్షిత ప్రథమస్థానం, గురువన్నపేట జడ్పీఎస్ఎస్‌కు చెందిన నవ్య ద్వితీయ, పాములపర్తి జడ్పీఎస్ఎస్‌కు చెందిన సాయిప్రియ, చింతమడక జడ్పీఎస్ఎస్‌కు చెందిన లోహిత్ తృతీయస్థానం దక్కించుకున్నారు. అనంతరం విజేతలకు ఇందిరానగర్‌స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజప్రభాకర్‌రెడ్డి, జిల్లా సోషల్ ఫోరం నాయకులు మెమొంటో, సర్టిఫికెట్లు అందజేశారు. విజేతలు ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టాలెంట్‌టెస్ట్‌కు హాజరవుతారని తెలిపారు.


ప్రతిభాపాటవ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పుల్‌కల్, ఫిబ్రవరి 3: రాత్రి స్నేహితులతో కలిసి మద్యం తాగి.. తెల్లవారేసరికి శవమై కనిపించాడు ఓ యువకుడు. ఈ ఘటనకు సంబంధించి జోగిపేట సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాకు చెందిన మూడ్ ప్రవీణ్(27) అదే తండాకు చెందిన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం రాత్రి స్థానిక బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేసి తాగారు. శనివారం ఉదయం వరకు ప్రవీణ్ ఇంటికి రాకపోవడంతో కుటుబసభ్యులు వెతకగా అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న వారి పొలం వద్ద శవమై కనిపించాడు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. ప్రవీణ్‌ను హత్య చేశారంటూ కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. జోగిపేట సీఐ నాగరాజు, పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తేనే అన్ని నిజాలు తెలుస్తాయని, సహకరించాలని కోరడంతో శాంతించారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆనవాళ్లను సేకరించారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. తండాకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ప్రవీణ్‌కు ఇద్దరు భార్యలు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రమేష్ మృతదేహం

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 3 : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దశంకరంపేటలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన కడమంచి రమేష్(20) తాగిన మైకంలో గడికోట శివారులో ఉన్న కిరాణం దుకాణంపైకి ఎక్కాడు. విద్యుత్ వైర్లు తగిలి కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం విషయం తెలయడంతో ఎస్ఐ బాలరాజు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కడమంచి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## క్రషర్‌లో ప్రమాదం.. ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కంది, ఫిబ్రవరి 3 : కంది మండల పరిధి ఎర్దనూర్ శివారులోని ఓ స్టోన్ క్రషర్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్దనూర్ తండాకు చెందిన భీముడునాయక్ గ్రామ శివారులోని ఓ క్రషర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం క్రషర్‌లో బ్లాస్టింగ్ జరుగున్న సమయంలో కొన్ని రాళ్లు ఎగిరిపడ్డాయి. అందులో ఓ రాయి భీముడుకుడి చేతికి బలంగా తలగడంతో చెయ్యి నుజ్జునుజ్జయ్యింది. గ్రామస్థులు వెంటనే అతన్ని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో భీముడిని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పరామర్శించారు. అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, అలాగే ప్రమాదానికి కారణమైన క్రషర్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## లక్డారంలో క్రషర్ సీజ్



క్రషర్‌ను సీజ్ చేసిన అధికారులు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 3 : లక్డారంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం సంతోష్ క్రషర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ క్రషర్లపై విచారణ కొనసాగుతుందని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అన్ని క్రషర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

● 35 తులాల బంగారం మాయం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 3 : తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 35 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన సిద్దిపేట పట్టణంలో శనివారం వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని మహాశక్తినగర్‌కు చెందిన సుమన్ ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సుమన్ ఫిబ్రవరి 1వతేదీన ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో సహా కామారెడ్డికి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి శుక్రవారం సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లాకర్‌లో ఉన్న 35 తులాల బంగారం పోయినట్లు గుర్తించాడు. సుమన్ వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలను సేకరించారు. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

## సిలిండర్ నుంచి మంటలు.. తప్పిన ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చేగుంట, ఫిబ్రవరి 3 : నార్సింగి మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఓ పూరిగుడిసెలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో గువ్వలేగి భిక్షపతి నివాస పూరిగుడిసెలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వచ్చాయి. వెంటనే ఎస్ఐ అహ్మద్, రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలాన్ని చేరుకుని గ్యాస్ సిలిండర్ నుంచి వెలువడిన మంటలు ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు పదివేల వరకు ఆస్తి నష్టం జరిగింది. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

## పాడైపోయిన తినుబండారాలు.. ఫ్రిజ్‌లో బొద్దింకలు

● నారాయణఖేడ్ పట్టణంలోని బేకరీల్లో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీ



బేకరీలోని పాడైన ఆహారపదార్థాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 3: నారాయణఖేడ్ పట్టణంలోని పలు బేకరీల్లో శనివారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకరీల్లో పాడైపోయిన తినుబండారాలు, ఫ్రిజ్‌లోని కేక్‌లలో బొద్దింకలు కనిపించాయి. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పట్టణంలోని ఓ బేకరీలో, స్వీట్ హౌస్‌లో తనిఖీలు చేయగా వంటకాలు తయారు చేసే హౌస్‌లలో అపరిశుభ్రమైన వాతావరణం, చెడిపోయిన ఆహారపదార్థాలు కనిపించాయి. బేకరీలోని ఫ్రిజ్‌లో బొద్దింకలున్నాయి. చెడిపోయిన కేక్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బేకరీల్లోని ఆహార పదార్థాలపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై కమిషనర్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. దీంతో కేక్ వరల్డ్ బేకరీ యజమానికి రూ.5 వేలు, స్వీట్ హౌస్ యజమానికి రూ.1000 జరిమాన విధించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపిస్తామన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు.

# ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ

● వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాతీయరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్/సిద్దిపేట అగ్రికల్చర్ ఫిబ్రవరి 3 : ప్రత్యేకాధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని రాష్ట్ర పంచాతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి స్పెషలాఫీసర్ల పాలన ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు అంకితభావంతో పనిచేస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రత్యేకాధికారులకు వారి అధికారాలు, బాధ్యతల గురించి ఒక రోజు శిక్షణను అందించి అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమవర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సీతక్క తెలియజేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, యువత, మహిళలు, ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. జాతరలు ఉన్న ప్రాంతాల్లో పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధికారులను ఆదేశించారు. జాతరలు జరిగే రెండు రోజుల ముందు నుంచే పెద్దఎత్తున ప్రచారం చేయాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థాల నిరోధానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగియడంతో 2 నుంచి ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకొని పాలన సాగిస్తున్నారన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా కార్యాచరణ రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా ముందుకెళుతున్నట్లు వివరించారు. ప్రతీ కుటుంబానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ జిల్లాలోని 647 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించామని, ఆయా అధికారులు విధుల్లో చేరారన్నారు. వారికి విధులు, బాధ్యతలపై శిక్షణ అందించామని మంత్రికి తెలిపారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని విధాల ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రత్యేకాధికారులకు దిశానిర్దేశం చేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించేలా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రికి కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేష్, డీపీవో సాయిబాబా, డీఆర్డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి నుంచి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సురేష్‌మోహన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జడ్పీ సీఈవో రమేష్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకాధికారులు బాధ్యతగా పనిచేయాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌కు సంబంధించి చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 : గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు బాధ్యతగా పనిచేయాలని, గ్రామ పాలనకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శనివారం ప్రత్యేకాధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె విధుల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు కొత్త పనిని భారంగా భావించకుండా సంతోషంగా చేయాలని సూచించారు. విధుల్లో భాగంగా గ్రామాల్లో సందర్శించి పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా పారిశుధ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ మరుగుదొడ్లను శుభ్రం చేయించాల్సిన బాధ్యత పంచాయతీలదేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో పొడి చెత్త అమ్మకం ద్వారా నిధులు సమకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. మార్చి 31లోగా వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకాధికారి సందర్శించి మౌలిక వసతులను పరిశీలించి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, డీపీవో సురేష్‌మోహన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే అభివృద్ధిలోకి

విద్యతోనే అన్ని రకాలుగా అభివృద్ధిలోకి వస్తామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు ప్రిన్స్ పైప్స్ పరిశ్రమ వారి సహకారంతో, మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి విద్యా అత్యంత ప్రాధాన్యమైనదని, అందులో అమ్మాయిలకు మరీ ముఖ్యమన్నారు. ఓ లక్ష్యంతో ముందుకు సాగాలని, ఆశయం నెరవేరేలా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు బాసటగా నిలిచిన పరిశ్రమ యాజమాన్యం, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఏడు పాఠశాలల్లో 50 మంది పదో తరగతి విద్యార్థులకు గుర్తించి వారికి రూ.5 లక్షల విలువ చేసే చెక్కు, 8, 9వ తరగతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఎంఈవో వెంకట ర్సింలుగౌడ్, ప్రిన్స్ పైప్స్ పరిశ్రమ యాజమాన్యం, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేసిన సేవలే గుర్తింపు తెస్తాయి

● దక్షిణమధ్య రైల్వేబోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్

జహీరాబాద్, ఫిబ్రవరి 3 : గ్రామాల్లో ప్రజలకు చేసిన సేవలు, చేపట్టిన అభివృద్ధి పనులు గుర్తింపు తీసుకొస్తాయని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్ అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో శనివారం మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో పలువురు సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పదవిలో ఉన్నప్పుడు ప్రజలతో మమేకంగా ఉండడం, చేపట్టిన పనులు, పలుకరింపులు, ప్రజల పట్ల ఆప్యాయతగా నడుచుకున్న తీరు తదితరాలు గుర్తింపు తెచ్చి పెడుతాయన్నారు. పదవులు శాశ్వతం కాదనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. గ్రామాల్లో ప్రజలతో నాయకులు కలిసిమెలిసి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతు తాత్కాలికంగా లభించే పదవుల వ్యామోహంలో పడి ప్రజలకు సేవచేయడాన్ని నాయకులు మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి ఎంపీడీవో మహేష్, చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్, తాజా మాజీ సర్పంచులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.



సర్పంచ్‌ను సన్మానిస్తున్న షేక్‌ఫరీద్

# ఏడుపాయల జాతర ఏర్పాట్ల ఊసేది?

● ఇంకా సమీక్ష సమావేశమే నిర్వహించలేదు

● ప్రతీసారి ఆలస్యంగా పనులు

పాపన్నపేట, ఫిబ్రవరి 2 : ఏడుపాయల వనదుర్గామాత జాతరకు ప్రతీ ఏటా ఆలస్యంగా ఏర్పాట్లను ప్రారంభించడం, అరకొర పనులనే చేపట్టడం జరుగుతుంది. ఈసారి ఇదే తంతు కొనసాగేలా ఉంది. ముందస్తుగా సమీక్ష సమావేశాన్ని కూడా నిర్వహించడం లేదు. ఈ నెల9న మాఘ అమావాస్య, మార్చి 9న మహాశివరాత్రి పర్వదినం ఉన్నప్పటికీ ఏడుపాయల జాతర ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తుంది. మహాశివరాత్రి వేళ ఏడుపాయల వనదుర్గమ్మ జాతర ప్రారంభమవుతుంది. వారం రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో కన్నులపండువగా జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి రూ.కోటి వరకు నిధులను వెచ్చిస్తున్నారు కానీ భక్తులకు కనీస సౌకర్యాలను ఏర్పాట్లు చేయడం లేదు. అయితే జాతరకు 15 రోజుల ముందే పనులను ప్రారంభించడం, ఆ పనులను నామమాత్రంగా చేసి చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారింది. తీరా చూస్తే జాతరకు అదనంగా మరో రూ.కోటి ఖర్చు అయినట్లు లెక్కలు ఉంటాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కన్న అమ్మవారికి వచ్చే ఆదాయం ఎక్కువగా ఉన్న, పక్కా ప్రణాళికతో జాతర కార్యక్రమాలను చేయడం లేదని భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైన జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లను ముందే నుంచే చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నామినేట్ చేయబడ్డ పాలకవర్గం ఈ ఏడు జాతరపైన ప్రత్యేకంగా దృష్టి సారించలేక పోతుంది. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ చూపితే తప్ప జాతర పనుల్లో వేగం అందుకోదు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

● కలుషిత ఆహారం తినడంతో..

చేగుంట, ఫిబ్రవరి 3 : పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు తిన్న ఆహారంతో ఐదుగురు అస్వస్థతకు గురైన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని బి.కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. బి.కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఉదయం 11 గంటల సమయంలో వాంతులు చేసుకున్నారు. వెంటనే స్పందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లం 108 అంబులెన్స్‌లో విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్, నిఖిల్, ప్రణయ్, కిరణ్‌ను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి అజిత్‌కుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో కారణాలపై వాకబు చేశారు. గ్రామంలో శుక్రవారం సంత కావడంతో సాయంత్రం వేళ పానిపూరి, కట్లెస్ బండిపై తినుబండారాలను తిన్నారని, కలుషిత ఆహారంతో ఫుడ్‌పాయిజన్ అయి విద్యార్థులకు వాంతులైనట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విషయం తెలుసుకున్న చేగుంట తహసీల్దార్ గియా ఉన్నిసా బేగం, ఎస్ఐ హరీష్‌గౌడ్, కొండాపూర్ గ్రామానికి చేరుకుని పాఠశాలలో విద్యార్థుల అస్వస్థత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

## సోషల్ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్రస్థాయికి 9 మంది ఎంపిక



సోషల్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3: తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయికి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింలు తెలిపారు. తెలుగు మీడియం నుంచి 63 మంది, ఇంగ్లీష్ మీడియం నుంచి 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎంపికైన వారిలో తెలుగు మీడియం నుంచి ప్రథమ విష్ణువర్ధిన్(జడ్పీహెచ్‌ఎస్ మనోహరాబాద్), ద్వితీయ అనుష్క(జడ్పీహెస్‌ఎస్ రామాయంపేట), తృతీయ సుదీప్త(జడ్పీహెచ్‌ఎస్ నస్కల్), ఇంగ్లీష్ మీడియం నుంచి ప్రథమ సుమంత్(ఎంజేపీ బాయ్స్ హెచ్‌ఘణపూర్), ద్వితీయ వినయశ్రీ(జడ్పీహెచ్‌ఎస్, తూప్రాన్), తృతీయ సృజన్(ఎంజేపీ బాయ్స్ హెచ్‌ఘణపూర్), ప్రైవేటు స్కూల్స్ విభాగం నుంచి ప్రథమ సాయిచరణ్(శంకర స్కూల్ నిజాంపేట), ద్వితీయ శ్రీప్రియ(గీతా చేగుంట), తృతీయ సోహన్ దీప్‌సింగ్(సత్యం విద్యా మందిర్, శివ్వంపేట) ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోటీ పరీక్షలకు సోషల్ సబ్జెక్ట్ తప్పనిసరి అన్నారు. ఈ సబ్జెక్టు ద్వారానే జాతీయ బావాలు, నైతికవిలువలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, డైట్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, హెచ్‌ఎం రేఖ, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులను పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంచండి

● కష్టపడి కాదు.. ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలి

● రచయిత యండమూరి వీరేంద్రనాథ్




విద్యార్థినిని అభినందిస్తున్న యండమూరి వీరేంద్రనాథ్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 3 : విద్యార్థులను పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంచి, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలని రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. శనివారం నందిగామ రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. విద్యార్థులను మొబైల్‌కు దూరంగా ఉంచాలని, వాటితో చాలామంది విద్యార్థులు మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా విద్యార్థులను ప్రోత్సహించేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల కారణంగా బాల్యం నుంచే బంధుత్వాలకు దూరమవుతున్నారని, నాయనమ్మ, తాతయ్యతో కూడా సఖ్యత లేకుండా పెరుగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ రెండేళ్లుగా రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అకడమిక్, హోలిస్టిక్ ఎడ్యుకేషన్‌లో ఒక వెలుగు వెలిగిందన్నారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యండమూరి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, ఎంఈవో పీపీ రాథోడ్, బానూర్ సీఐ రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అతిథులుగా అభిజ్ఞ, మిస్ పర్ఫెక్ట్ మూవీ టీమ్ సభ్యులు హాజరయ్యారు.

## జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

తూప్రాన్, ఫిబ్రవరి 3 : తూప్రాన్ సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాలలో 9వ అంతర్ జిల్లాల జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలను నిర్వహించారు. హాజరై మాట్లాడారు. ఈ పోటీలో మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ జట్లు లీగ్ దశలో ఉత్తమ ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ముఖ్యఅతిథిగా హాజరైనర మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినోద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, అభిషేక్ గౌడ్, ప్రధాన కార్యదర్శినవీన్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వహణ కార్యదర్శి రమేష్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్న కేటీఆర్

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ధ్వజం

నర్సాపూర్, ఫిబ్రవరి 3: ప్రభుత్వం కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకార పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులుగౌడ్ అన్నారు. శనివారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాలేదని, అప్పుడే బీఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. పదవులు లేకుండా ఆ పార్టీ నేతలు ఉండలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడాన్ని జీర్ణించుకోలేక అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌కు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి తప్పదని, ఆ తర్వాత ఆపార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

## నేడు బీజేపీ 'మెదక్' సన్నాహక సమావేశం

మనోహరాబాద్, ఫిబ్రవరి 3 : భారతీయ జనతా పార్టీ మెదక్ పార్లమెంట్ పరిధిలోని శక్తి ప్రముఖులు, బీజేపీ మండల అధ్యక్షులు, ఆపైస్థాయి నాయకుల సమావేశం ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని దండుపల్లి వద్ద ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు మెదక్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కోఘారు సంగమేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి పల్వాయి హరీష్ బాబు, దుబ్బాక మాజీ ఏమ్మెల్యే రఘునందన్‌రావు హాజరవనున్నారు.

## నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

జోగిపేట, ఫిబ్రవరి3: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు కేంద్రాల్లో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు మెదక్ వెస్ట్ రీజయన్ ఆర్‌సీవో భీమయ్య తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అందోలు, రంజోల్, చిట్కుల్, కొండాపూర్, ఇస్నాపూర్, హత్నూర కాలేజీ, హత్నూర స్కూల్, మెదక్, రామాయంపేట, కొల్చారం, తూప్రాన్‌లో 11 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షను నిర్వహించనున్నామన్నారు. ఒక్కో సెంటర్‌లో 480 మంది చొప్పున విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయనున్నట్టు భీమయ్య వివరించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని భీమయ్య సూచించారు.

## మూఢనమ్మకాల నియంత్రణలో జేవీవీది కీలక పాత్ర

● డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3: మూఢనమ్మకాలను నియంత్రించడంలో జనవిజ్ఞాన వేదికది కీలకపాత్ర అని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ హాల్‌లో శనివారం జన విజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న జేవీవీని ఆయన అభినందించారు. అనంతరం జేవీవీ నాయకుడు సత్యం చేసిన సైన్స్ మేజిక్ షో విద్యార్థులను ఆకట్టుకున్నది. చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు జిల్లా నుంచి 102 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 12 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి, విజేతలకు సర్టిఫికేట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి జాన్‌పాల్, సీనియర్ నాయకులు సోమశేఖర్, ఉపాధ్యక్షుడు బాలయ్య, కోశాధికారి ప్రశాంత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూములు ఆక్రమించిన వారిపై చర్యలు

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 3: పెద్దశంకరంపేట పట్టణం తిరుమలాపూర్ శివారులోని సర్వే నెంబర్1 లో సర్వేచేసి, భూములను ఆక్రమించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వరు అన్నారు. శనివారం తిరుమలాపూర్ శివారులోని సర్వే నెంబరు 1లో ప్రభుత్వ భూములను ఆయన మెదక్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. తిరుమలాపూర్ శివారులో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని సమాచారం అందడంతో నాలుగు రోజుల క్రితం ఆర్డీవో, డీపీవోలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారన్నారు. సర్వే నెంబరు 1లో మూడు నాలుగు రోజుల్లో మరోసారి సర్వే చేసి హద్దులు గుర్తిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించి వెంచర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఉన్న వెంచర్లకు డీటీసీపీ అప్రూవల్ ఉందా లేదా అని సంబంధిత తహసీల్దార్ కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఆర్ఐ.శర్ణప్ప, తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

### అక్రమ నిర్మాణాల కూల్చివేత

హత్నూర, ఫిబ్రవరి 3: హత్నూర మండల పరిధిలోని ఎల్లమ్మగూడ గ్రామశివారులో అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు శనివారం కూల్చివేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబరు 509/35లో వడ్డెపల్లి గ్రామానికి చెందిన చింతల్‌చెర్వు రామయ్యకు 50ఏళ్ల క్రితం ప్రభుత్వం ఎకరా 2గుంటలు అసైన్డ్ చేసింది. రామయ్య మృతి చెందగా.. అతడి కుటుంబీకులు ఆ భూమిని ఇతరులకు విక్రయించారు. అందులో కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకోగా.. మరికొందరు కొనుగోలు చేసిన భూమికి సిమెంటు పలకలతో ప్రహరి నిర్మాణం చేశారు. ఈ విషయం తెలుసుకున్న హత్నూర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వడ్డెపల్లి పంచాయతీ కార్యదరి అలేఖ్య జేసీబీ సహాయంతో నిర్మాణాలను కూల్చివేశారు. ఆ ప్రభుత్వ భూమికి వారసులు ఎవరు లేకపోవడంతో తమ అధీనంలోకి తీసుకోనున్నట్లు ఆర్ఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు. అంతే కాకుండా ఇళ్ల నిర్మాణం చేసిన వ్యక్తులకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## మంత్రి ఆదేశాలతో శానిటేషన్ పనులు



ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలు తొలగించే పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తూప్రాన్, ఫిబ్రవరి3: తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని గురుకుల పాఠశాల, కళాశాలలో శానిటేషన్ పనులను శనివారం ముమ్మరంగా చేపట్టారు. శుక్రవారం బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శానిటేషన్ పై మంత్రి అధికారులను ప్రశ్నించారు. దాంతో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ ఆధ్వర్యంలో శానిటేషన్ పనులను చేపట్టారు. గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో యంత్రం సహాయంతో పరిసరాలను శుభ్రం చేశారు.

## దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

వెల్దుర్తి, ఫిబ్రవరి 3: భూమిని కబ్జా చేయడమే కాకుండా పట్టాదారుపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన సాయిలు, రవి, వెంకటేష్‌లు వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామానికి చెందిన దండ్ల సుగుణకు చెందిన సర్వే నంబర్ 1728/12 లోని రెండు ఎకరాల భూమిని కబ్జా చేయడమే కాకుండా ఆమెను దుర్భాషలాడుతూ కొట్టారని సుగుణ పోలీసుల ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పదవీ కాలం పూర్తి చేసిన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 3: గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశించిన మహాత్మాగాంధీ స్ఫూర్తితో నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలను ప్రగతి పథంలో నడిపామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి అన్నారు. నియోజవకర్గంలో పదవీవిమరణ చేసిన సర్పంచ్‌లను, వార్డు సభ్యులను శనివారం పటాన్‌చెరులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు దేవానందం, సుష్మావేణుగోపాల్‌రెడ్డి, ప్రవీణాభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీలు సుప్రజ, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచులకు ఎమ్మెల్యే ఆత్మీయ సన్మానం

గుమ్మడిదల, ఫిబ్రవరి 3 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గుమ్మడిదల మండల బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ సర్పంచులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణా భాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి

● పశు సంవరకశాఖ జేడీఏ వసంత

జహీరాబాద్, ఫిబ్రవరి 3: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉత్తమఫలితాల సాధనకు కృషిచేయాలని పశుసంవర్ధకశాఖ జేడీఏ వసంత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మల్‌చెల్మ గ్రామంలో ప్రభుత్వోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని తప్పకుండ పాఠశాలలకు పంపించాలన్నారు. త్వరలో పదోతరగతి వార్షికపరీక్షలు జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకుని మెరుగైన ఫలితాలను సాధించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యే తరహాలో విద్యాబోధన చేపట్టాలన్నారు. అనంతరం ఆమె పలురికార్డులను పరిశీలించారు. చదువు విషయంలో ఏమైనా అనుమానాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవిస్తూ, పట్టుదలతో చదువుకోవాలని ఆమె విద్యార్థులకు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జేడీఏ వసంత

## సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మొగులయ్య, కోశాధికారిగా శ్రవణ్‌రావు, ఉపాధ్యక్షుడిగా శశికుమార్, సంధ్య సంయుక్త కార్యదర్శులుగా నర్సింగరావు, అనురాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దుర్గాభవాని, ప్రచార కార్యదర్శిగా శ్రీను, కార్యవర్గ సభ్యులుగా దత్తస్వరూప్, ప్రశాంత్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాష తదితరులు పాల్గొన్నారు.

## 'సప్తగిరి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి '



చేగుంట తహసీల్దార్ గియా ఉన్నీసా బేగానికి వినతిపత్రం అందజేసిన అనంతసాగర్‌కు చెందిన రైతులు

చేగుంట, ఫిబ్రవరి 3 : సప్తగిరి పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాల కారణంగా పొలాల్లో పంటలు పండక నష్టపోతున్నామని చేగుంట మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన రైతులు శనివారం స్థానిక తహసీల్దార్ గియా ఉన్నీసా బేగానికి వినతిపత్రం అందజేశారు. ఈ పరిశ్రమ కారణంగా చుట్టుప్రక్కల ప్రాంతంలోని బోరుబావుల్లోని జలాలు కలుషితమవుతున్నాయన్నారు. పరిశ్రమ యాజమాన్యానికి రెండు సంవత్సరాల నుంచి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యజమానులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర శాసనం తేవాలి

గుమ్మడిదల, ఫిబ్రవరి 3 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అ సంఘటిత రంగ కార్మికులకు సమగ్ర శాసనం తేవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే రాజయ్య పేర్కొన్నారు. శనివారం గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అన్నారు. ఫిబ్రవరి 16 వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందని, సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు నాగేశ్వరరావు, నాయకులు భిక్షపతి, నరేష్, హమాలీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మా ఇల్లు ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 : వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం సంయుక్తంగా సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యుజే-ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమయ్యే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ జీవితంలో ఎదగాలన్న తపన, నేర్చుకోవాలన్న ఆసక్తి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. అనంతరం టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన తొమ్మిది మందికి డీఈవో వెంకటేశ్వర్లు, అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్షురాలు సునీతఖన్నా, కార్యదర్శి రామ్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ లింబాజి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న డీఈవో, తోపాజి, యాదగిరి

## ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3: మెదక్ కేంద్రంగా ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు సెక్రటరీ శృతి ఓఝాకి శనివారం తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకన్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా మెదక్ జిల్లాకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని మెదక్‌లో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో సెక్రటరీ సానుకూలత వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీజీఎల్ఏ ఉపాధ్యక్షుడు డా. శ్రీపతి సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



### నేడు విద్యా సదస్సు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మెదక్‌లోని ద్వారకా గార్డెన్‌లో విద్యాసదస్సు నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే రోహిత్‌రావు, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరుకానున్నారు.



# ప్రారంభించిన పనులను త్వరగా పూర్తిచేయాలి

● మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 3: నర్సాపూర్ పట్టణంలో పలు వార్డుల్లో ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. శనివారం పట్టణంలోని 11,12 వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్రత్యేక నిధులతో అన్ని వార్డుల్లో సీసీరోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే కొన్ని వార్డుల్లో పనులు పూర్తి కాగా, మరికొన్ని వార్డుల్లో కొన్ని కారణాల వల్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటన్నింటినీ త్వరలో పూర్తి చేయాలని సూచించినట్లు చెప్పారు. వీటితో పాటు ఇంకా చేపట్టిన మరికొన్ని పనులు కూడా పూర్తి చేయించడానికి స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో తనవంతు ప్రయత్నిస్తున్నానని అశోక్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు నగేష్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



11వ వార్డులో సీసీ రోడ్డుపనులను పరిశీలిస్తున్న చైర్మన్

## రైతులు విధిగా చిరుధాన్యాలను సాగుచేయాలి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 3 : ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాలను రైతులు విధిగా సాగుచేయాలని డీడీఎస్ మహిళ సభ్యులు సూచించారు. శనివారం మండలంలోని రేజింతల్ గ్రామంలో పాతపంటల జాతర కొనసాగింది. ఈ సందర్భంగా జాతర కో-ఆర్డినేటర్ వినయ్‌కుమార్, డీడీఎస్ మహిళా రైతులు మాట్లాడుతూ డీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలను, రైతులను, అధికారులను ప్రభావితం చేసే దిశగా పాతపంటల జాతర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుతుబ్‌మియా, ఎంపీటీసీ శ్రీను, డీడీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీ నిధులతో లాల్‌సింగ్ తండాలో హైమాస్ట్ లైట్లు

పుల్‌కల్, ఫిబ్రవరి 3: మండలంలోని లాల్‌సింగ్ నాయక్ తండాలో జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడు బీబీ పాటిల్ ఎంపీ ల్యాండ్స్ నుంచి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. స్థానిక భవానీ సేవాలాల్ ఆలయం వద్ద లైట్లను ఏర్పాటు చేయాలంటూ స్థానిక గిరిజనులు ఎంపీ బీబీ పాటిల్‌కు విజ్ఞప్తి చేయగా, స్పందించిన ఎంపీ నిధులు మంజూరు చేశారు. మంజూరైన హైమాస్ లైట్లను దేవాలయం వద్ద శనివారం అమర్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

### నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులే!

● జహీరాబాద్ పట్టణ సీఐ రాజు

జహీరాబాద్, ఫిబ్రవరి 3 : వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, ముఖ్యంగా బుల్లెట్ బైక్‌లకు పెద్దసౌండ్ పెట్టి రోడ్లపై నడిపిస్తే వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని జహీరాబాద్ పట్టణ సీఐ రాజు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంత ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా గంజాయి, మత్తు పదార్థాల రవాణాలను చేపడితే శిక్ష తప్పదన్నారు. కాలనీల్లో అనుమానాస్పదంగా ఏవరైనా తిరిగితే 100 నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు.

### 'యువత మంచి మార్గంలో పయనించాలి'

వెల్దుర్తి, ఫిబ్రవరి3: యువత మంచి మార్గంలో ప్రయాణించాలని ఎస్ఐ నవతాగౌడ్ సూచించారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నవతగౌడ్‌ను శనివారం భీమ్ వారియర్స్ యువజన సంఘం నాయకులు కలిసి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. అలాగే వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఎస్ఐను సత్కరించారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

## వ్యసనాలకు దూరంగా ఉండాలి

● జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3 : యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా శనివారం తెలంగాణ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరై మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. రాజ్యాంగం, హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

### తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడిగా రాంచందర్



నారాయణఖేడ్, ఫిబ్రవరి 3: తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడిగా నారాయణఖేడ్‌కు చెందిన విరామ హిందీ ఉపాధ్యాయుడు కె.రాంచందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ తాను చేసిన సేవల వల్లే తనకు ఈ పదవి లభించిందని, హిందీ భాష అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

### పీఆర్టీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా పరమేశ్వర్ రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 3: తెలంగాణ పీఆర్టీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా మెతుకు పరమేశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీ పి.సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షుడిగా మెతుకు పరమేశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

## షబ్బీర్ అలీని అభినందించిన మాజీ ఎంపీ



షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అంజేస్తున్న సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి3: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియామకం అయిన షబ్బీర్ అలీని శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో జహీరాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్‌షెట్కార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీని సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు రషీద్ తదితరులు ఉన్నారు.

### 'ఖేలో ఇండియా' కబడ్డీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం చర్యలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 : సంగారెడ్డి జిల్లాకు 'ఖేలో ఇండియా' కబడ్డీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడలశాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కేంద్రాన్ని పటాన్‌చెరు మండలం భానూర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాంచందర్‌రావు తెలిపారు. ఈ కబడ్డీ శిక్షణ కేంద్రానికి ఏటా రూ.5 లక్షల నిధులు కేంద్రం మంజూరు చేయనున్నది. క్రీడా పరికరాలు, సామగ్రి అందజేయనున్నారు. అంతే కాకుండా కోచ్‌కు రూ.23 వేల ప్రోత్సాహకం అందించనున్నది. కబడ్డీ క్రీడలో బాలబాలికలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన తర్ఫీదు ఇస్తారు. కబడ్డీలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారుడు శివ దరఖాస్తు చేసుకోవడంతో తాజాగా ఈ కేంద్రం ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని అధికారులు తెలిపారు.

### జాతీయ రహదారి భూములను పరిశీలించిన ఆర్డీవో

నారాయణఖేడ్, ఫిబ్రవరి 3: నారాయణఖేడ్ - నిజాంపేట్-బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కోల్పోనున్న భూములను శనివారం స్థానిక ఆర్డీవో వెంకటేష్ పరిహారం కోసం ప్రకటించే ఉత్తర్వులలో భాగంగా పరిశీలించారు. నారాయణఖేడ్ మండలం జూకల్, నిజాంపేట మండలం మునిగేపల్లి, నిజాంపేట శివార్లలో గతంలో సర్వే నిర్వహించి ఏర్పాటు చేసిన మార్కింగ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత భూముల రైతులతో ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన వెంట ఖేడ్, నిజాంపేట తహసీల్దార్లు దేవిదాస్, రాజాగణేష్, తదితరులు ఉన్నారు.

### నోట్ పుస్తకాల వితరణ

గుమ్మడిదల ఫిబ్రవరి 3 : గుమ్మడిదల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కెరియర్ కౌన్సిలింగ్ సెమినార్, నోట్ పుస్తకాల వితరణ నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఏకాగ్రతతో చదవాలని ఫౌండేషన్ అధ్యక్షుడు ఏలే వెంకట్ నారాయణ, వ్యక్తిత్వ వికాస నిపుణులు బాలే ప్రవీణ్, ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు శేఖర్, మహేష్ లు పేర్కొన్నారు.

## దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

వెల్దుర్తి, ఫిబ్రవరి 3 : ఈనెల 16న దేశ వ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌కు సంబంధించిన కరపత్రాలను గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో వెల్దుర్తి మండల గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు దుర్గాపతి, హమాలీ యూనియన్ మండల అధ్యక్షుడు వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

● పుల్‌కల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన జరుపతలపెట్టిన అఖిల భారత సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. చౌటకూర్ మండలం శివంపేటలో చార్మినార్ బీరు పరిశ్రమలో శనివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.బాగారెడ్డి ఆధ్వర్యంలో సమ్మెపోస్టర్, కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, నాయకులు పాల్గొన్నారు.

● జిన్నారం : సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజయ్య ఆధ్వర్యంలో గడ్డపోతారం పారిశ్రామికవాడలో పలు పరిశ్రమల ప్రతినిధులను కలిసి ఫిబ్రవరి 16న జరిగే బంద్‌కు సహకరించాలని నోటీసులను అందజేశారు. కార్మికులు, ప్రజలు, రైతులు వివిధ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌కు సహకరించాలని కోరారు.